రేప్, హత్యకు పాల్పడితే ఉరిశిక్ష

'అపరాజిత' బిల్లుకు బెంగాల్ అసెంబ్లీ ఆమోదం

కోల్‌కతా: ఆర్‌జీ కర్ దవాఖానలో పీజీ వైద్య విద్యార్థినిపై హత్యాచారంతో దేశమంతా అట్టుడుకడంతో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మంగళవారం అత్యాచార నిరోధక బిల్లు 'అపరాజిత ఉమెన్ అండ్ చైల్డ్'ను శాసనసభలో ప్రవేశపెట్టింది. అధికార, విపక్షాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన ఈ బిల్లు ప్రకారం రేప్ కేసులో బాధితురాలి మరణం సంభవించినా, లేదా ఆమెను అసహాయ స్థితిలో విడిచిపెట్టినా నిందితులకు మరణ శిక్ష విధిస్తారు. దేశంలో మహిళల రక్షణకు సరైన చట్టాలను రూపకల్పన చేయలేని ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని ఈ సందర్భంగా సీఎం మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. మరోవైపు, ఆర్జీకర్ దవాఖాన మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌పై బెంగాల్ ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది.

గ్యాంగ్ రేప్ చేసి.. నగ్నంగా డ్యాన్స్ చేయించి

బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో మహిళ పై దారుణం

ఇండోర్, సెప్టెంబర్ 3: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఇండోర్‌లో 34 ఏండ్ల మహిళను జూన్ 11న ఐదుగురు వ్యక్తులు ఒక గోడౌన్‌లోకి తీసుకువెళ్లి సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. అంతేగాకుండా ఆమెను బెల్టుతో కొడుతూ నగ్నంగా డ్యాన్స్ చేయిస్తూ రాక్షసానందం పొందారు. బాధితురాలు దీనిపై జూలై 17న ఫిర్యాదు చేసినా కనాడియా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించింది. ఎట్టకేలకు హైకోర్టు ఆదేశాలతో సోమవారం కేసు నమోదు చేశారు. అయితే నిందితులనెవరినీ అరెస్ట్ చేయలేదని తెలిపారు. కాగా, నిందితుల్లో బీజేపీ నేత ఉండటం వల్లే పోలీసులు కేసు నమోదు చేయలేదని రాష్ట్ర కాంగ్రెస్ నేత నీలబ్ శుక్లా ఆరోపించారు. దీనిని బీజేపీ ప్రతినిధి నరేంద్ర సలూజ ఖండించారు.

ఉద్యోగులకు జీతాలెప్పుడు?

- హిమాచల్‌లో కాంగ్రెస్ సర్కారు దీనావస్థ
- వేతనాలివ్వడానికి రాష్ట్ర సర్కారు యాతన
- అడ్డగోలు గ్యారెంటీలతో ప్రభుత్వ ఖజానా ఖాళీ
- వేతనాలు ఎప్పుడు జమ చేస్తామన్న విషయాన్ని కూడా వెల్లడించని ప్రభుత్వం
- పండుగల వేళ జీతాలివ్వకుంటే ఎలా?
- సుఖు ప్రభుత్వంపై ఉద్యోగుల మండిపాటు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): పది గ్యారెంటీల పేరిట అడ్డగోలు హామీలిచ్చి హిమాచల్ ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా దిశగా పరుగులు పెట్టిస్తున్నది. హామీల అమలు పేరిట ఇప్పటికే కొత్త అప్పులు, పింఛనర్ల సంక్షేమ నిధి డబ్బులను వాడుకొన్న సుఖ్‌విందర్ సింగ్ సుఖు సర్కారు.. ప్రభుత్వోద్యోగుల జీతాలు చెల్లించడానికి కూడా నానా యాతన పడుతున్నది. ఒకటో తారీఖు వచ్చి మూడునాలుగు రోజులు గడిచినప్పటికీ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఇంకా జీతాలు జమ కాలేదని జాతీయ మీడియా 'టైమ్స్‌నౌ' ఓ కథనంలో వెల్లడించింది. ఖజానా ఖాళీ కావడమే దీనికి కారణంగా తెలిపింది. జీతాలు ఆలస్యమవుతాయన్న కనీస ప్రకటనను కూడా సుఖు సర్కారు చేయకపోవడాన్ని ఎండగట్టింది. వేతనాల ఆలస్యంతో దాదాపు 2 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులపై ప్రభావం పడనున్నట్టు వివరించింది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇటీవల అసెంబ్లీలో మాట్లాడుతున్న హిమాచల్ సీఎం సుఖు

జీతాలు జమ చెయ్యాలి

నిత్యావసర ధరలు పెరిగాయి. పైగా పండుగల సీజన్ వచ్చింది. ఇలాంటి సమయంలో సమయానికి జీతాలు వేయకుంటే కుటుంబంతో ఎలా బతుకుతాం. ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల వేతనాలను విడుదల చేయాలి.

– కుమార్ దాస్, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల ఫెడరేషన్ కన్వీనర్

పండుగ సీజన్‌లో కష్టం
ఈ వారం నుంచే పండుగల సీజన్ మొదలవుతున్నదని, జీతాలు పడకపోతే కుటుంబంతో పండుగలను ఎలా జరుపుకోవాలంటూ పలువురు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు విడుదల చేయకుండా సుఖు సర్కారు జాప్యం చేయడంపై మండిపడుతున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు, రాష్ట్రాన్ని కాంగ్రెస్ సర్కారు ఆర్థికంగా కుదేలయ్యేలా చేసిందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. రాహుల్ గాంధీ చెప్పే 'ఖటాఖట్' ఉచితాల వల్లే రాష్ట్రానికి ఈ పరిస్థితి దాపురించిందని ప్రతిపక్ష నేత జైరాం ఠాకూర్ ఆరోపించారు. కాగా, దేశంలో తలసరి అప్పు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో హిమాచల్ ప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఈ రాష్ట్రం అప్పు రూ.86,589 కోట్లకు చేరింది.

అనర్హత వేటు పడ్డ ఎమ్మెల్యేలకు పింఛన్లు కట్

బిల్లు ప్రవేశపెట్టిన హిమాచల్ కాంగ్రెస్ సర్కారు

సిమ్లా, సెప్టెంబర్ 3: ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటుకు గురైన ఎమ్మెల్యేలకు పింఛన్లు నిలిపివేయాలని హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం.. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్(ఫిరాయింపుల నిరోధక చట్టం) కింద అనర్హతకు గురైన ఎమ్మెల్యేలకు పింఛన్ దక్కదు. ఫిబ్రవరిలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థికి ఓటు వేయడంతో వారిపై అనర్హత వేటు పడింది. వీరి పింఛన్లను నిలిపివేసేందుకు ప్రభుత్వం ఈ బిల్లు తీసుకువచ్చింది.

కళ్లద్దాలకు ఇక చెల్లు!

- **ప్రెస్బి యోపియా చికిత్సకు ఐ డ్రాప్స్**
- **తయారుచేసిన ఎన్టాడ్ ఫార్మాస్యూటికల్స్**
- **వచ్చే నెల మార్కెట్‌లోకి.. ధర రూ.350**

ముంబై, సెప్టెంబర్ 3: కంటిచూపు మందగించిన వారికి కళ్లద్దాల అవసరాన్ని దూరం చేసే కొత్త ఐ డ్రాప్స్ మార్కెట్‌లోకి రానున్నాయి. ముంబైకు చెందిన ఎన్టాడ్ ఫార్మాస్యూటికల్స్ అనే ఫార్మా కంపెనీ తయారుచేసిన ఈ ఐ డ్రాప్స్‌కు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) ఆమోదం తెలిపింది. వయసు పెరుగుతున్న కొద్దీ కంటిచూపు మందగించే సమస్యను చాలా మంది ఎదుర్కొంటున్నారు. దీనినే ప్రెస్బియోపియా అంటారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 109 నుంచి 180 కోట్ల మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. సాధారణంగా 40 -45 ఏండ్ల వయసులో ఈ సమస్య మొదలవుతుంది. 60 ఏండ్ల వయసు వచ్చేనాటికి తీవ్రమవుతుంది. ప్రెస్బియోపియా ఉన్న వారికి దగ్గరి వస్తువులు సరిగ్గా కనిపించవు. ఏదైనా చదవాలంటే కళ్లద్దాలు తప్పనిసరి అవుతుంది. ఈ సమస్యకు చికిత్స చేసేందుకు 'ప్రెస్‌వు ఐ డ్రాప్స్'ను ఎన్టాడ్ ఫార్మాస్యూటికల్స్ అభివృద్ధి చేసింది. దీనిని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్(సీడీఎస్‌సీఓ)కు చెందిన నిపుణుల బృందం సిఫార్సు చేయడంతో డీసీజీఐ తుది అనుమతి ఇచ్చింది. ఈ ఐ డ్రాప్స్ వేసుకోవడం వల్ల ప్రెస్బియోపియా బాధితులకు కళ్లద్దాల అవసరం తగ్గుతుందని ఎన్టాడ్ ఫార్మాస్యూటికల్స్ తెలిపింది. దీని ధర రూ.350 వరకు ఉంటుందని, అక్టోబరు మొదటి వారం నుంచి మార్కెట్‌లోకి అందుబాటులోకి తెస్తామని ప్రకటించింది.

7,000 కార్లు.. 1800 గదుల రాజభవనం

ఇదీ బ్రూనై సుల్తాన్ రాజవైభోగం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3: ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల ద్వైపాక్షిక పర్యటనలో భాగంగా మంగళవారం బ్రూనై చేరుకున్నారు. భారత్ ప్రధాని బ్రూనై రావడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా బ్రూనై 29వ సుల్తాన్‌గా 1968లో పట్టాభిషిక్తుడైన రాజు హాజీ హసనల్ బోల్కియా రాజవైభోగాల గురించి విస్తృత చర్చ జరుగుతున్నది. 30 బిలియన్ కోట్ల డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుల టాప్ జాబితాలో ప్రతి ఏడాది స్థానం పొందే ఆయన లగ్జరీ వాహనాల కలెక్షన్‌లో 7,000 అత్యంత ఖరీదైన వాహనాలు ఉన్నాయి. 1979 నుంచి ఆయనకు మూడు సొంత విమానాలతో పాటు హెలికాప్టర్లు ఉన్నాయి. ఆయన నివాసం ప్రపంచంలోనే అత్యంత పొడవైన రాజభవనంగా పేరొంది గిన్నిస్ బుక్‌లో స్థానం పొందింది. లక్షలాది చదరపు అడుగుల విస్తీర్ణంలో బంగారు గోపురాలతో నిండి ఉంటుంది.

2025 మార్చిలో శనిగ్రహ వలయాలు కనుమరుగు!

కొన్ని రోజులకు మళ్లీ కనిపిస్తాయి: శాస్త్రవేత్తలు

న్యూయార్క్: సౌర కుటుంబంలోని ఏడు గ్రహాలు సాధారణంగా కనిపిస్తాయి. శనిగ్రహం చుట్టూ మాత్రం కొన్ని వలయాలు కనిపిస్తాయి. అయితే, త్వరలో ఈ వలయాలు కనుమరుగు అవుతాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. భూమి నుంచి చూసే వారికి 2025 మార్చి నాటికి శనిగ్రహం చుట్టూ ఎలాంటి వలయాలు కనిపించవని తెలిపారు. మూడు దశాబ్దాలకు ఒకసారి జరిగిన ఖగోళ మార్పు వల్ల ఈ వలయాలు కనిపించకుండా పోతాయని చెప్పారు. సూర్యుడి చుట్టూ తిరిగే క్రమంలో శనిగ్రహం 26.7 డిగ్రీల అక్షీయ వంపు తీసుకుంటున్నందున భూమి నుంచి శనిగ్రహం చుట్టూ వలయాలు కనిపించబోవని తెలిపారు. అయితే, ఇది తాత్కాలికమేనని, 2025 మార్చి తర్వాత కొన్ని రోజులకు మళ్లీ క్రమంగా కనిపించడం ప్రారంభం అవుతుందని తెలిపారు.

మంత్రి సన్నిహిత కంపెనీకి భూసంతర్పణ

- **కర్ణాటకలో ఒక్కొక్కటిగా వెలుగులోకి భూబాగోతాలు**
- **కేఐఏడీబీ స్థలాల కేటాయింపులో అక్రమాలు**
- **కర్ణాటక మంత్రి ఎంబీ పాటిల్‌పై ఆరోపణలు**

పాటిల్

బెంగళూరు, సెప్టెంబర్ 3: కర్ణాటక కాంగ్రెస్ సర్కారు మెడకు మరో భూకుంభకోణం చుట్టుకుంటున్నది. తన సన్నిహితులకు చెందిన సంస్థకు పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ అప్పనంగా భూమిని కేటాయించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు సంబంధించి బీజేపీ నేత చలవాది నారాయణస్వామి కీలక విషయాలను వెల్లడించారు. బగ్‌మనే డెవెలపర్స్ అనే సంస్థ నుంచి రూ.4 కోట్ల అప్పు తీసుకున్నట్టు ఎంబీ పాటిల్ తన 2023 అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఈ బగ్‌మనే డెవెలపర్స్‌లో డైరెక్టర్లుగా ఉన్న రాజా బగ్‌మనే, వెంకటరామప్ప రామకృష్ణ అనే ఇద్దరు వైగై ఇన్‌వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే మరో కంపెనీకి సైతం డైరెక్టర్లుగా ఉన్నారు. ఎంబీ పాటిల్ పరిశ్రమల శాఖ మంత్రి అయ్యాక ఈ వైగై సంస్థకు హైటెక్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ పార్కులోని కర్ణాటక పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి మండలి(కేఐఏడీబీ)కి చెందిన 7.8 ఎకరాల భూమిని కేటాయించారు. మంత్రి కుమారుడికి చెందిన మరో కంపెనీకి సైతం భూకేటాయింపు జరిగిందని చలవాది ఆరోపించారు. అయితే, భూకేటాయింపు నిబంధనల మేరకే చేసినట్టు ఎంబీ పాటిల్ తెలిపారు.

నాకేమీ ఆందోళన లేదు

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

మైసూరు, సెప్టెంబర్ 3: ముడా కుంభకోణంలో తనపై విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వడం పట్ల కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. తానేమీ తప్పు చేయలేదని, తనకేమీ ఆందోళన లేదని పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 'నాకు వ్యతిరేకంగా చెప్తున్న అబద్ధాలు నిజం కావడం లేదని ప్రతిపక్ష నేతలే ఆందోళనతో ఉన్నారు. నేను ఎప్పుడూ అబద్ధం చెప్పలేదు. నేను ఎలాంటి తప్పు చేయలేదు. కాబట్టి నాకు ఎలాంటి ఆందోళన లేదు' అని వ్యాఖ్యానించారు. కాగా, తనకు ముఖ్యమంత్రి కావాలని ఉందని పార్టీ నేత ఆర్వీ దేశ్‌పాండే చేసిన వ్యాఖ్యలపై సిద్ధరామయ్య స్పందిస్తూ.. సీఎంను చేయాల్సింది శాసనసభ్యులు, హైకమాండ్ అని, ముఖ్యమంత్రి ఎవరో వారే నిర్ణయిస్తారని పేర్కొన్నారు.

ముడా మాజీ కమిషనర్ సస్పెండ్
మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) మాజీ కమిషనర్ జీటీ దినేశ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ కర్ణాటక ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముడా కమిషనర్‌గా ఉన్నప్పుడు జీటీ దినేశ్ కుమార్ అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొన్నది. ముడానుంచి తప్పించుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వందినేశ్ కుమార్‌ను బలిపశువును చేసిందని బీజేపీ నేత బీవై విజయేంద్ర ఆరోపించారు.

ఉక్రెయిన్‌పై రష్యా బాలిస్టిక్ క్షిపణులు

50 మంది మృతి..200 మందికి గాయాలు

కీవ్, సెప్టెంబర్ 3: రష్యా సైన్యం వరుస క్షిపణి దాడులతో ఉక్రెయిన్ నగరాలపై విరుచుకుపడుతున్నది. ఉక్రెయిన్ తూర్పు మధ్య ప్రాంతంలోని పోల్టావా పట్టణంపై రెండు బాలిస్టిక్ క్షిపణుల్ని రష్యా తాజాగా ప్రయోగించింది. ఈ దాడిలో కనీసం 50 మంది పౌరులు చనిపోయారని, మరో 200 మంది తీవ్రంగా గాయపడ్డారని అధ్యక్షుడు జెలెన్‌స్కీ మంగళవారం తెలిపారు. నగరంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్ భవనం పాక్షికంగా దెబ్బతినగా, శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని తెలిపారు. ఓ విద్యా కేంద్రం, సమీపంలోని దవాఖానపై రష్యా క్షిపణి దాడులకు పాల్పడిందని చెప్పారు. రష్యా సరిహద్దు నుంచి 110 కిలోమీటర్ల దూరంలోని పోల్టావా నగరంపై రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. 2022 ఫిబ్రవరి 24న మొదలైన ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో తాజా దాడులు అత్యంత భీకరమైనవిగా పేర్కొన్నారు. క్షిపణి దాడులపై నగరంలో సైరన్ మోగగానే తమను తాము రక్షించుకునేందుకు ఉక్రెయిన్ ప్రజలు బాంబ్ షెల్టర్ల వైపు పరుగులు తీశారు.

అమరత్వం కోసం పుతిన్ యత్నం!

దివ్యౌషధం కోసం శాస్త్రవేత్తలకు ఆదేశాలు

న్యూఢిల్లీ: తనను అమరుడిగా మార్చాలంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్ శాస్త్రవేత్తలను ఆదేశించినట్టు 'డెయిలీ మెయిల్' ఓ కథనాన్ని ప్రచురించింది. శాస్త్రవేత్తలు ఆ పని చేసి పెడితే రష్యాను ఎప్పటికీ ఏలే యాలన్నది పుతిన్ కల కావొచ్చు. జీవ గడియారాన్ని వెనక్కి తిప్పడం గురించి ఏం చేశారని జూన్‌లో రష్యా ఆరోగ్య శాఖ వైద్యులు, పరిశోధకులకు లేఖ రాసిన విషయాన్ని డెయిలీ మెయిల్ గుర్తుచేసింది. అయితే అమరత్వాన్ని ప్రసాదించే దివ్యౌషధాన్ని తయారుచేసేందుకు కొన్ని సంవత్సరాలు, బిలియన్ల కొద్దీ ఖర్చవుతుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

2.75 లక్షల మొబైల్ నంబర్లు బ్లాక్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3: స్పామ్ కాల్స్ బెడదను నివారించడానికి టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ చేపట్టిన ప్రయత్నాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ఇప్పటివరకు 50 సంస్థలు, 2.75 లక్షల మొబైల్ నంబర్లను యాక్సెస్ ప్రొవైడర్లు బ్లాక్ లిస్టులో పెట్టాయి. అన్‌రిజిస్టర్డ్ టెలీ మార్కెటర్లపై చర్యలు తీసుకోవాలన్న ట్రాయ్ ఆదేశాల మేరకు టెలికం సంస్థలు ఈ మేరకు చర్యలు చేపట్టాయి.

9 మంది నక్సల్స్ మృతి

- **ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్**
- **మృతుల్లో ఆరుగురు మహిళలు**

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 3: ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. దంతేవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో ఆరుగురు మహిళలు సహా తొమ్మిది మంది మావోయిస్టులు మరణించారు. ఛత్తీస్‌గఢ్ అదనపు డీజీపీ వివేకానంద సిన్హా , బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం తెలిపిన వివరాల ప్రకారం.. కిరండూల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లోహగావ్, పురంగెల్, ఆండ్రీస్ అడవుల్లో మావోయిస్టులు సమావేశమైనట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో రెండు రోజులుగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు జరిగాయి. ఘటనా స్థలంలో తొమ్మిది మంది మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఆరుగురు మహిళా మావోయిస్టులు ఉన్నారు.

బస్తర్ రేంజ్‌లోనే 153 మంది మృతి
బస్తర్ రేంజ్‌లో ఈ ఏడాది ఇప్పటివరకు 153 మంది మావోయిస్టులు ఎదురుకాల్పుల్లో మృతి చెందారని, 669 మంది మావోయిస్టులను అరెస్టు చేశామని, 656 మంది లొంగిపోయారని ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు.

తోడేళ్లు కనిపిస్తే కాల్చివేత

యోగి సర్కార్ ఆదేశం

లక్నో, సెప్టెంబర్ 3: మానవ రక్తం రుచి మరిగి ప్రాణాంతకంగా మారిన తోడేళ్ల బెడదను అరికట్టడానికి యూపీలోని యోగి ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. తోడేళ్లు కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులను మంగళవారం జారీ చేసింది. అయితే దీనిని అఖరి ప్రత్యామ్నాయంగా మాత్రమే వినియోగించాలని ఆదేశించింది. ఇటీవల కాలంలో నరమాంస భక్షక తోడేళ్ల దాడిలో భరూచ్ జిల్లాలో పలువురు మృతిచెందడంతో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకున్నది. కాగా, సోమవారం తన అమ్మమ్మ పక్కన పడుకున్న ఐదేండ్ల బాలికను తోడేలు గాయపరిచింది. కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు అప్రమత్తం కావడంతో అది పారిపోయింది. ఇటీవల కాలంలో తోడేళ్ల గుంపు చేసిన దాడిలో ఈ ప్రాంతంలో 34 మంది ప్రజలు గాయపడ్డారు. 8 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో అటవీ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా 'ఆపరేషన్ భేడియా' నిర్వహించి నాలుగు తోడేళ్లను పట్టుకున్నారు. ఇంకా మిగిలిన రెండు తోడేళ్ల కోసం ముమ్మరంగా గాలింపు కొనసాగుతున్నది. ఈ ప్రాంతాన్ని ఏడు జోన్లుగా విభజించి ఎప్పటికప్పుడు తోడేళ్ల జాడల కోసం ప్రయత్నిస్తున్నారు.

భార్యకు డ్రగ్స్ ఇచ్చి 72 మందితో లైంగిక దాడి

ఫ్రాన్స్‌లో పదేండ్ల పాటు ఓ భర్త అకృత్యం

పారిస్, సెప్టెంబర్ 3: 72 మంది అపరిచితులతో తన భార్య(72)పై పదేండ్ల పాటు లైంగిక దాడి చేయించిన ఓ భర్త అకృత్యం ఫ్రాన్స్‌లో కలకలం రేపుతున్నది. సోమవారం ఈ కేసు విచారణ ప్రారంభమైంది. మొత్తం 92 సార్లు బాధితురాలిని 72 మంది రేప్ చేశారని, వీరిలో 51 మందిని గుర్తించామని పోలీసులు తెలిపారు. నిందితుడు శక్తివంతమైన మత్తు మందులిచ్చి ఆమెపై లైంగిక దాడులు చేయించినట్టు తెలిసింది. తనపై జరిగిన అకృత్యాల గురించి వీలైనంత మందికి అవగాహన కల్పించడం వల్ల భవిష్యత్తులో ఇలాంటివి జరగకూడదని బాధితురాలు కోరుకుంటున్నదని ఆమె తరపు న్యాయవాది తెలిపారు. 2020లో బాధితురాలు తనపై జరిగిన అకృత్యాలను గుర్తించింది. నిందితుడు డొమినిక్యూ పి సెప్టెంబర్ 2020లో ఓ షాపింగ్ సెంటర్‌లో ముగ్గురు మహిళల స్కర్ట్ల కింది భాగాన్ని వీడియో తీస్తుండగా ఓ సెక్యూరిటీ గార్డ్ పట్టుకున్నాడు. అతడి కంప్యూటర్‌లో అతడి భార్యపై జరిగిన లైంగిక దాడులకు సంబంధించిన వందలాది ఫొటోలు, వీడియోలు బయటపడ్డాయి.

'భర్తను వేరే గదిలో నివసించమనడం క్రూరత్వమే'

అలహాబాద్: భర్తను వేరే గదిలో నివసించమనడం, సంసారం చేయడానికి నిరాకరించడం భౌతిక, మానసిక క్రూరత్వం కిందకు వస్తుందని.. విడాకుల మంజూరుకు ఇది తగిన కారణమని అలహాబాద్ హైకోర్టు తెలిపింది. మానసిక క్రూరత్వాన్ని నిరూపించడం కష్టమని.. వాస్తవాలు, పరిస్థితుల ఆధారంగా దాన్ని పరిశీలించాలని చెప్పింది. భర్తను వేరే గదిలో నివసించమని ఒత్తిడి చేయడం ద్వారా అతడితో కాపురం చేయడానికి భార్య నిరాకరించడం అతడి దాంపత్య హక్కులను నిరాకరించడమేనని కోర్టు తెలిపింది. ఓ కేసులో ఈ మేరకు దంపతులకు విడాకులు మంజూరు చేసింది.

గోవుల స్మగ్లర్‌గా పొరపడి విద్యార్థి హత్య

*న్యూఢిల్లీ: 12*వ తరగతి విద్యార్థిని(19) గోవుల స్మగ్లర్ అని పొరపాటుగా భావించిన కొందరు గో సంరక్షకులు అతడిని కాల్చి చంపారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో జరిగిన ఈ ఘటనలో అయిదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కొందరు పశువుల స్మగ్లర్లు డస్టర్, ఫార్చూన్ కార్లలో నగరంలోకి ప్రవేశించినట్టు గోసంరక్షకులకు సమాచారం అందింది. అదే సమయంలో బాధితుడు ఆర్యన్ మిశ్రా తన స్నేహితులు హర్షిత్, శాంకీ, మరో ఇద్దరు మహిళలతో కలిసి డస్టర్ కారులో వెళ్తుండగా, పశువుల స్మగర్లుగా భావించి గోసంరక్షకులు 25 కిలోమీటర్లు వెంబడించారు. వాళ్లపై కాల్పులు జరపడంతో ఆర్యన్ మిశ్రా ప్రాణాలు కోల్పోయాడు.

ఐఐటీ-బాంబేలో 25% మంది గ్రాడ్యుయేట్లకు ఉద్యోగాల్లేవ్

తగ్గిన ప్రాంగణ నియామకాల శాతం.. కనిష్ఠ వార్షిక వేతనం రూ.4 లక్షలే

ముంబై, సెప్టెంబర్ 3: దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన ఐఐటీ-బాంబేలో ఈ ఏడాది జరిగిన ప్రాంగణ నియామకాల్లో ఆశ్చర్యకర విషయాలు వెలుగు చూశాయి. ఐఐటీ విద్యార్థులకు నూరు శాతం ఉద్యోగావకాశాలు వస్తాయన్న చాలామంది అంచనాను తలకిందులు చేస్తూ ఇక్కడ చదివిన విద్యార్థుల్లో 75 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలొచ్చాయి. గత ఏడాది ఇది 84 శాతం ఉంది. అలాగే కనిష్ఠ వార్షిక వేతనం గత ఏడాది రూ.6 లక్షలు ఉండగా, ఈ ఏడాది అది రూ.4 లక్షలకు దిగజారింది. అయితే సగటు వార్షిక వేతన ప్యాకేజ్ 7.7 శాతం పెరిగి రూ.23.5 లక్షలకు చేరుకుంది. ప్రాంగణ నియామకాలకు హాజరైన వారిలో 75 శాతం మందికి ఆఫర్ లెటర్లు వచ్చాయి. గత ఏడాది ఇక్కడకు 324 కంపెనీలు రాగా, ఈసారి 364 కంపెనీలు పాల్గొన్నాయి. అయితే అంతర్జాతీయ ఉద్యోగ ఆఫర్లలో ఐఐటీ బాంబే మంచి పెరుగుదల సాధించింది. మొత్తం 78 ఆఫర్లను విద్యార్థులు అంగీకరించగా, అందులో 22 ఉద్యోగాలకు కోటి రూపాయలకు పైగానే వార్షిక వేతనం ఉంది.

రోడ్లు ఊడ్చే పనికి గ్రాడ్యుయేట్ల పోటీ

- **స్వీపర్ ఉద్యోగాలకు 40 వేల మంది పట్టభద్రులు, 6 వేల మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ల దరఖాస్తు**
- **కాంట్రాక్ట్ ఉద్యోగానికే ఇంత భారీ డిమాండ్**
- **హర్యానాలో నిరుద్యోగ తీవ్రతకు అద్దం పడుతున్న వైనం**

హెచ్‌కేఆర్‌ఎన్

ఛండీగఢ్, సెప్టెంబర్ 3: దేశంలో నిరుద్యోగ తీవ్రతకు అద్దం పట్టే వార్త ఇది. రోడ్లు ఊడ్చే పారిశుధ్య కార్మికుల ఉద్యోగాలకు డిగ్రీలు, పీజీలు చదివిన యువత పోటీ పడుతున్న పరిస్థితి బీజేపీ పాలిత హర్యానాలో నెలకొన్నది. హర్యానా కౌశల్ రోజ్‌గార్ నిగమ్(హెచ్‌కేఆర్‌ఎన్) డాటాలో వెల్లడైన అంశాలు ఆశ్చర్యపరుస్తున్నాయి. హర్యానా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ప్రభుత్వ సంస్థ ఇది. ఈ సంస్థ ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖలు, మున్సిపాలిటీలు ఉద్యోగాలను భర్తీ చేస్తుంటాయి. తాజాగా స్వీపర్ ఉద్యోగాల కోసం హెచ్‌కేఆర్‌ఎన్ ఒక ప్రకటన జారీ చేసి దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ ఉద్యోగాలకు ఆగస్టు 6 నుంచి సెప్టెంబరు 2 వరకు ఏకంగా 39,990 మంది పట్టభద్రులు, 6,112 మంది పీజీ చదివిన వారు దరఖాస్తు చేసుకున్నారు. 12వ తరగతి పూర్తి చేసిన మరో 1,17,144 మంది సైతం దరఖాస్తు పెట్టుకున్నారు.

తక్కువ జీతం.. కాంట్రాక్ట్ ఉద్యోగం
ఇంతలా పోటీ ఉండేందుకు ఇవేమీ ప్రభుత్వం కల్పించే శాశ్వత ఉద్యోగాలు సైతం కావు. జీతం కూడా భారీగా ఏమీ లేదు. కేవలం రూ.15 వేల నెలవారీ వేతనంతో ఇచ్చే కాంట్రాక్టు ఉద్యోగాలు ఇవి. పొరపాటున దరఖాస్తు చేశారని చెప్పడానికి కూడా వీలు లేదు. ఉద్యోగ ప్రకటనలోనే ఉద్యోగ బాధ్యతలు, చేయాల్సిన పనులను స్పష్టంగా పొందుపరిచారు. రోడ్లు, బహిరం